

మహదేవపూర్ : ప్రజావాణిలో డీటీ కృష్ణకు దరఖాస్తు ఇస్తున్న రైతు

తహసీల్ ప్రజావాణికి స్పందన కరువు

మహదేవపూర్/ మహాముత్తారం/ గణపురం/ కాటారం/ మొగుళ్లపల్లి, టేకుమట్ల, మార్చి 17 : జిల్లాలోని తహసీల్ కారాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఆయా మండలాల్లో దరఖాస్తులు రెండు అంకెలు దాటలేదు. మహాముత్తారం మండలంలో కనీసం ఒక్కరు కూడా దరఖాస్తు ఇచ్చేందుకు రాలేదు. ప్రజావాణి నిర్వహణపై ఆయా శాఖల అధికారులు ప్రజల్లో విసృత ప్రచారం కల్పించపోవడమే ఇందుకు కారణమని పలువురు ఆరోపిస్తున్నారు. మహదేవపూర్ మండలం నుంచి ఒకే దరఖాస్తు కొత్తపేట శివారు భూ సమస్యపై ఓ రైతు దరఖాస్తు ఇచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, ఏపీఎం రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేశ్, వ్యవసాయ శాఖ ఏవో సుప్రజ్యోతి, కాళేశ్వరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుస్మీత, విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ పాల్గొన్నారు. గణపురం మండలంలో నాలుగు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి తెలిపారు. ఎంపీడీవో భాస్కర్, ఎంఈవో ఉప్పలయ్య, ఏవో ఐలయ్య పాల్గొన్నారు. కాటారం తహసీల్‌లో వివిధ సమస్యలపై 7 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. రెవెన్యూ శాఖకు సంబంధించి భూముల సమస్యలు, రేషన్ కార్డులో పేర్లు తొలగింపుపై నలుగురు, విలాసాగర్ చెరువుల మరమ్మతు, దామెరకుంట వద్ద పెద్ద వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌తో లక్ష్మీపూర్, దుబ్బపల్లి రైతులు ఇబ్బందులు పడుతున్నారని రహదారి, వాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఒకరు దరఖాస్తు ఇచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. నీటి పారుదల శాఖ అధికారులు ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరయ్యారు. ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, పీహెచ్‌సీ వైద్యురాలు మౌనిక, ఏఈవో రాజన్న పాల్గొన్నారు. మొగుళ్లపల్లిలో వేతనాలు పెంచాలని కోరుతూ ఆశా కార్యకర్తలు తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. టేకుమట్లలో మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. కొత్త రేషన్ కార్డులు వచ్చిన వారికి రేషన్ బియ్యం రావడం లేదని సీపీఎంఎల్ లిబరేషన్ జిలా కార్యదర్శి మారపల్లి మల్లేశ్ వినతిపత్రం అందజేశారు. బూర్కపల్లి లో జరిగిన దొంగతనంలో బంగారం, నగదు కోల్పోయానని దొంగలను గుర్తించి తమ సొత్తు ఇప్పించాలని కొండ మొగిలి దరఖాస్తు చేయగా, కొడుకులు భూములు ఆస్తులు తీసుకుని తమను పట్టించుకోవడంలేదని, ఇదివరకు కలెక్టర్, ఆర్డీవోను కలిశామన్నారు. వారు కొడుకుల నుంచి చెరో ఎకరం భూమి రిజిస్ట్రేషన్ చేయాలని, నెలకు రూ.20 వేలు ఇవ్వాలని ఆర్డీవో నోటీసులు పంపినప్పటికీ పట్టించుకోవడం లేదని బండలపల్లి గ్రామానికి చెందిన బండి గంగయ్య, మల్లమ్మ తహసీల్దార్‌కు విన్నవించారు. ఎంపీడీవో అనిత, ఏవో కల్యాణి, డాక్టర్ ఆశాజ్యోతి, ఏఎస్పై అమరేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ హరీశ్, ఎంపీవో సురేశ్, కార్యదర్శి సాంబశివుడు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో వినతులు

ఏటూరునాగారం, మార్చి 17 : ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనులు వినతులు అందజేశారు. మండలంలోని గంటలకుంట గ్రామానికి చెందిన జోగయ్య తదితరులు కరెంటు సౌకర్యం కల్పించాలని పీవో చిత్ర మిశ్రాకు విన్నవించారు. ఆకులవారి ఘనపూర్‌కు చెందిన తల్లాడి శ్రావణి బాలికల హాస్టల్‌లో ఏఎన్ఎం పోస్టులో నియమించాలని కోరారు. మంగపేట మండలం రాజుపేట, రామచంద్రునిపేటలో సీసీ రోడ్డు మంజూరు చేయాలని బొగ్గం సుశీల, సున్నం సమ్మయ్య కోరారు. వాజేడు మండలం పెనుగోలు గ్రామానికి చెందిన పాయం నర్సింహారావుతో పాటు మరో నలుగురు అప్పులు, ఆర్థిక సమస్యలు ఉన్నందున డబ్బు రూపకంగా సహాయం చేయాలని విన్నవించారు. గుమ్మడి దొడ్డి గ్రామానికి చెందిన పాయం గౌరమ్మ, పాయం రాందాసు ఆర్థిక సహాయం, రైసు మిల్లు మంజూరు చేయాలని కోరారు. వాజేడు మండల కేంద్రానికి చెందిన కోరం చిరంజీవి ఎస్టీ స్టడీ సర్కిల్‌లో వసతి, శిక్షణ ఇప్పించాలని విన్నవించారు. మంగపేట మండలం బ్రాహ్మణపల్లికి చెందిన వై పద్మ ఏదైనా ఉపాధి కల్పించాలని కోరారు. మండలంలోని రాయబంధం గ్రామానికి చెందిన పద పొజ్జయ్య తదితరులు తమ వ్యవసాయ భూమి వెంకటాపురం గ్రామానికి చెందిన నీలమ్మ పేరున ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా చేసిన బీట్ ఆఫీసర్ రాజేశ్‌పై చర్య తీసుకోవాలని వేడుకున్నారు. రేగొండ మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన బానోత్ వినోద్‌కుమార్ సీసీ రోడ్లకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. మండల కేంద్రానికి చెందిన ఈసం రాజు గిరిజన ఇసుక సొసైటీల్లో జరుగుతున్న అక్రమాలపై నిరసన చేపట్టేందుకు దరఖాస్తు సమర్పించారు. డీడీపోచం, ఏవో రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

విద్యార్థినులకు కంటి అద్దాలు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, మార్చి 17 : కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దృష్టి లోపంతో బాధపడుతున్న విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా కలెక్టర్ హాజరై విద్యార్థులకు అందజేశారు. అనంతరం ప్రజావాణిలో పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల్లోని విద్యార్థులకు గత నెలలో కంటి పరీక్షలు నిర్వహించామని, చూపు సమస్యలున్న వారిని గుర్తించి జిల్లా ప్రధాన దవాఖానలో వారికి కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. 658 మంది విద్యార్థుల్లో 292 మందికి మొదటి విడుతగా ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తున్నామని, మిగతావారికి త్వరలో ఇస్తామన్నారు. కంటి పరీక్షల నిర్వహణకు చిట్యాల, మహదేవపూర్ మండలాలను యూనిట్‌గా తీసుకుని నాలుగు ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామన్నారు.

ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయండి

ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించి వాటిని ఆయా శాఖల అధికారులకు ఎండార్స్‌మెంట్ చేశారు. పరిష్కరించిన ఫిర్యాదులపై వచ్చే వారం సమగ్ర నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి గైర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టరేట్ ఏవోను ఆదేశించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు భరోసా నిధులు చెల్లించకుండా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఇబ్బంది పెడుతున్నా గోరికొత్తపల్లి మండలం బాలయ్యపల్లి గ్రామానికి చెందిన యాదగిరి చేసిన ఫిర్యాదుకు స్పందించిన కలెక్టర్ వెంటనే మేనేజర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే నిధులు ఇతర రుణాలకు ఎందుకు జమ చేస్తున్నారని, ప్రజలను ఎందుకు ఇబ్బందులు పెడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చెల్లింపుపై సమగ్ర సమాచారం ఇవ్వాలని, జాప్యం జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చల్లగరిగలో కూడా ఇలాంటి ఘటన జరిగిందని, ముమ్ముందు ఇలాంటి ఫిర్యాదులు వస్తే చైర్మన్‌కు నివేదిక పంపుతామని స్పష్టం చేశారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షల నిర్వహణకు 21 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. 121 ఉన్నత పాఠశాలలకు చెందిన 3,449 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను తహసీల్దార్లు పరిశీలించి ధ్రువీకరణ నివేదికలు అందజేయాలని ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్లు, ఇన్విజిలేటర్లను నియమించామని తెలిపారు. ప్రశ్న, జవాబు పత్రాలను ద్విచక్ర వాహనాలపై కాకుండా క్లోజ్డ్ వాహనాల్లో పోలీస్ భద్రత నడుమ తరలించాలని సూచించారు. వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈవో రాజేందర్, డీఎంహెచ్‌వో మధుసూదన్, డాక్టర్ శ్రీనివాస్, క్రైమ్ డీఎస్పీ నారాయణ, పీవో ప్రమోద్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

ములుగురూరల్, మార్చి 17 : రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నుంచి విద్యార్థులకు మంజూరైన కంటి అద్దాలను కలెక్టర్ టీఎస్ దివాకర సోమవారం తన కార్యాలయంలో విద్యార్థులకు అందజేశారు. జిల్లాలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించగా 1,427 మంది విద్యార్థులకు అద్దాలు అవసరం ఉన్నాయని గుర్తించారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్‌లో భాగంగా 1,219 మందికి అద్దాలు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, వైద్యాధికారులు రణధీర్, ప్రవీన్‌రెడ్డి, డెమో సంపత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

కంప్యూటర్ తరగతి గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్ దివాకర

గోవిందరావుపేట, మార్చి17 : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. సోమవారం మండలంలోని చల్వాయి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కృత్రిమ మేధా విద్యాబోధన తరగతి గదిని ఆయన ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదు పాఠశాలల్లో ఏఐ సహకారంతో వర్చువల్ రియాలిటీ విధానంలో పాఠాలు చెప్పేలా ఏర్పాట్లు చేశామన్నారు. 3 నుండి 5వ తరగతి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు, అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు ఏఐ ద్వారా బోధించనున్నట్లు తెలిపారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ఇష్టాగోష్టి నిర్వహించి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అక్కడి నుంచి జడ్పీహెచ్ఎస్, కేజీబీవీ విద్యార్థులకు మంజూరైన కంటి అద్దాలను అందించారు. ఆయన వెంట డీఈవో పాణిని, ఎంపీడీవో జవహర్ రెడ్డి, తహసీల్దార్ సృజన్, ఎంఈవో దివాకర్, ఏఎంవో మల్లారెడ్డి, హెచ్ఎం హట్కర్ సమ్మయ్య, వైద్యాధికారులు శ్రీనివాస్, జయప్రద పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

ములుగురూరల్, మార్చి 17 : గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంపత్‌రావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన 19 మంది నుంచి వినతులు స్వీకరించారు. అందులో భూ సమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉద్యోగ, ఉపాధి, ఆసరా పింఛన్ ఇతర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయన్నారు. సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

యువకుడి మృతి

చిట్యాల, మార్చి 17 : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపేట జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మేకల చందు (23) డిగ్రీ వరకు చదివాడు. తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న చేను వద్ద బాగా చదువుకుంటే ఈ ఎండ పని చేయాల్సిన అవసరం ఉండేది కాదని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన చందు అదే రోజు సాయంత్రం ఇంటిదగ్గర ఉన్న గడ్డి మందును తాగినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు చిట్యాల సివిల్ దవాఖానకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మరుసటి హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కాగా, చికిత్స పొందుతున్న చందు పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు చెప్పారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

రామయ్య కల్యాణానికి గోటి తలంబ్రాలు అందజేత

గణపురం, మార్చి 17 : మండలంలోని ధర్మరావుపేట ఉమామహేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో గోటితో వలిచిన తలంబ్రాలను సోమవారం భద్రాచలం రామాలయం ఈవోకు అందజేశారు. శ్రీరామనవమి రోజున జరుగనున్న సీతారాముల కల్యాణానికి అవసరమయ్యే గోటితో వలిసిన తలంబ్రాలను గత కొన్నేళ్లుగా అందజేస్తున్నారు. సేవా సమితి అధ్యక్షుడు ఆకుల సుభాశ్ ఆధ్వర్యంలో 100 మంది సేవకులతో కలిసి గోటితో వలిచిన తలంబ్రాలతో పాటు కల్యాణం రోజు అన్నదాన ప్రసాదం కోసం రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆకుల దామోదర్, రాజేందర్, కనికల శివకృష్ణ, కురిమిళ్ల తిరుపతి, తనికెళ్ల వసంత, పోలు రాజమ్మ పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన ఎంసీహెచ్ఆర్డీ అధికారులు

వెంకటాపూర్, మార్చి 17 : రామప్ప దేవాలయాన్ని సోమవారం సాయంత్రం హైదారాబాద్‌లోని మానవ వనరుల అభివృద్ధి శిక్షణ సంస్థలో శిక్షణ పొందుతున్న కేంద్ర ప్రభుత్వ 25 మంది అధికారులు సందర్శించారు. శిక్షణలో భాగంగా తెలంగాణ దర్శన్‌లో రామప్ప దేవాలయంతో పాటు వరంగల్‌కోట, వేయిస్తంభాల గుడి, లక్నవరం, రామప్ప సరస్సును వారు సందర్శించారు. ఆలయ అర్చకులు హరిశేశర్మ, ఉమాశంకర్ వారికి స్వాగతం పలికి రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను టూరిజం గైడ్ దార్పా తెలుసుకొని మాట్లాడారు. రామప్ప శిల్పకళ అద్భుతమని కొనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఎంసీహెచ్ఆర్డీ ఐటీ అధికారులు శ్రీనివాస్, రవి ఉన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ ఉద్యోగులకు ప్రమాద బీమా

గణపవరం, మార్చి 17 : కేటీకే ఓసీ-3 ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల ప్రమాద బీమా సదుపాయానికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) అధికారులతో సోమవారం కేటీకే ఓసీ- త్రీలో పీఎన్‌బీ సర్కిల్ హెడ్ సుజిత్, భూపాలపల్లి మేనేజర్ ప్రమోద్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీఎన్‌బీ, సింగరేణి సంస్థ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం రూ.40 లక్షల ప్రమాద బీమా పథకాన్ని అమలు చేశారు. పీఎన్‌బీ అధికారులు ఈ పథకం గురించి, కాంట్రాక్ట్ ఉద్యోగులకు అవసరమైన మార్గదర్శకాలు అందజేశారు. ప్రమాద బీమా క్లెయిమ్ ప్రక్రియ, పాలసీ ప్రయోజనాలు, నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో మేనేజర్ భానుప్రసాద్, వెల్ఫేర్ ఆఫీసర్ సాయికృష్ణ, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ క్రాంతికుమార్, కాంట్రాక్ట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, మార్చి 17 : జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి టీ శైలజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు OBMMS ఆన్ లైన్ పోర్టల్ https://tgobmmsnew.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

రేణుకా ఎల్లమ్మ గుడి పరిశీలన

గణపురం, మార్చి 17: మండలకేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ గుడిని సోమవారం దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ నందనం కవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుడి నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరయ్యాయని, త్వరగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పూర్తయిన వెంటనే గుడి దేవాదాయ శాఖలో కలుస్తుందన్నారు. దీంతో ధూప దీప నైవేద్యం కింద నిధులు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణగౌడ్. గౌడ సంఘం అధ్యక్షుడు మాదాసు రవిగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్ సభ్యుడు చోటేమియా, మార్క మొగిలిగౌడ్ పాల్గొన్నారు.

లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

వెంకటాపురం (నూగూరు), మార్చి 17 : లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈఘటన మండలంలోని రామచంద్రాపురం గ్రామ సమీపంలోని గుడి గుట్టల సమీపంలో సోమవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు ఇసుక లారీలు వరుసగా వెళ్తున్నాయన్నారు. రామచంద్రాపురం గ్రామ సమీపంలోని గుడి గుట్టల సమీపంలోని రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించేందుకు ముందు ఉన్న లారీ డ్రైవర్ లారీని స్లో చేయగా వెనుక వస్తున్న లారీ డ్రైవర్ వేగంగా వచ్చి అదపు తప్పి ఢీకొట్టాడని తెలిపారు. ఈ ప్రమాదంలో వెనుక లారీ డ్రైవర్ సతీశ్ తీవ్ర గాయాలు కాగా, స్థానికులు 108 సహాయంతో ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

250 మందికి కంటి పరీక్షలు

ములుగురూరల్, మార్చి 17 : జిల్లా కేంద్రంలో జంపన్న చారిట బుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించి 250 మందికి కంటి పరీక్షలు చేశారు. ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు భూక్యా జంపన్న మాట్లాడుతూ సత్య కంటి ఆసుపత్రి వైద్య నిపుణులతో పరీక్షలు చేయగా 39 మంది కంటి సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. వారికి ఉచితంగా ట్రస్ట్ ద్వారా మహబూబాబాద్‌లో కంటి ఆపరేషన్లు చేయించనున్నట్లు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు 21 కేంద్రాల ఏర్పాటు

ములుగురూరల్, మార్చి 17 : పదో తరగతి వార్షిక పరీక్షలను ఈ నెల 21 నుంచి నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఈవో జీ పాణిని, ఏసీజీఈ జయదేవ్ సోమవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 3,134 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 21మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 21మంది డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, 170 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు. అలాగే రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతీ రోజు గంట ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకొని ప్రశాంతంగా రాయాలని వారు సూచించారు.

అనుమానాస్పదంగా మహిళ మృతి

తాడ్వాయి, మార్చి17 : మండలంలోని కాటాపురానికి చెందిన మునిగాల ఈశ్వరి (35) అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. ఈశ్వరి కొంతకాలంగా భర్తతో వేరుగా కాటాపురంలో ఉంటుంది. కాగా, సోమవారం మధ్యాహ్నం ఉరేసుకొని మృతిచెందిందని తెలియడంతో అప్పటికే మృతదేహం కిందకి దించి ఉండటంతో పాటు ఆమె ఒంటిపై తీవ్రగాయాలు ఉన్నట్లు తెలిసింది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అనుమానితులను విచారిస్తున్నారు. ఈశ్వరిది హత్యా, ఆత్మహత్యా అనేది తేలాల్సి ఉంది. గ్రామస్తులు మాత్రం కొందరు వ్యక్తులు కొట్టిచంపి ఉరేసి ఆత్మహత్యలా చిత్రీకరిస్తున్నారని చర్చించుకుంటున్నారు.

కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ధర్నా

ములుగురూరల్, మార్చి 17 : తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమ్జద్ పాషా మాట్లాడుతూ రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేసి జిల్లాలో నష్టపోయిన మక్క జొన్న రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు. సన్నధాన్యానికి బోనస్ చెల్లించి రైతులకు ఆదుకోవాలని అన్నారు. లక్నవరం, రామప్ప కాల్వకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులకు క్వింటాకు రూ.25వేల మద్దతు ధర చెల్లించాలన్నారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు నర్సయ్య, ఐలయ్య, సారయ్య, రమేశ్, ఫణి, స్వామి, మహేందర్, సాంబయ్య, వెంకటరమణ, వెంకట్రామ్, సీపీఐ నాయకులు రాజు, ఇంజం కొమురయ్య పాల్గొన్నారు.

వజ్రోత్సవ వేడుకలకు రూ.లక్ష సహాయం

ఏటూరునాగారం, మార్చి 17 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల వజ్రోత్సవ వేడుకలు నిర్వహించేందుకు వేడుకల కన్వీనర్ ఇర్సవడ్ల వెంకన్న సోమవారం రూ. లక్ష అందజేశారు. పలుమార్లు నిర్వహించిన వేడుకల సన్నాహక సమావేశంలో తన వంతుగా రూ.లక్ష సోమవారం కమిటీ సభ్యులకు అందచేశారు. 1968 నుంచి 2025 సంవత్సరం వరకు పాఠశాలలో చదివిన విద్యార్థులంతా ఆర్థికంగా సహకరించి వేడుకలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు, కమిటీ సభ్యులు హస్సేన్, నామ కరంచందు, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, కూనూరు అశోక్, నూతి రమేశ్, సర్వ వెంకన్న, కందుకూరి సుధాకర్, పాలకుర్తి శ్రీనివాస్, కుమారస్వామి, బొలసాని గౌరీశంకర్, పెండ్యాల సతీశ్ పాల్గొన్నారు.

జీరో మద్యం విక్రయిస్తున్న నిందితుల అరెస్ట్

మహాముత్తారం, మార్చి 18 : సుంకం చెల్లించని మద్యాన్ని మధ్యప్రదేశ్ నుంచి మండలంలోని గిరిజన గ్రామాలకు సరఫరా చేస్తున్న నిందితులను సోమవారం ఎక్సైజ్ శాఖ అధికారులు అరెస్టు చేశారు. కనుకునూర్, సింగంపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో సుంకం చెల్లించని మద్యం అమ్ముతున్నారనే పక్కా సమాచారంతో దాడులు నిర్వహించగా కనుకునూర్ గ్రామానికి చెందిన బొచ్చు అనసూర్య భర్త అశోక్‌ను పట్టుకుని విచారించగా సింగంపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ్, ప్రేమ్‌కుమార్, నర్సింగాపురం గ్రామానికి చెందిన గాదె సారయ్య సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మహాముత్తారం గ్రామానికి చెందిన సుధాకర్, మారబోని బాపును పట్టుకొని విచారించగా మండలకేంద్రానికి చెందిన ఎండీ మహబూబ్ పాషా మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి మద్యం తీసుకొచ్చి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కాగా మరో నిందితుడు మహబూబ్ బాషా పరారీలో ఉన్నట్లు కాటారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కిష్టయ్య తెలిపారు.

కేంద్ర కుట్రలను తిప్పి కొట్టాలి

ములుగురూరల్, మార్చి 17 : అంగన్‌వాడీ వ్యవస్థ నిర్మూలనకు కేంద్రం పన్నిన కుట్రలను తిప్పి కొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య అన్నారు. అంగన్‌వాడీ టీచ ర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ సమీపంలో 48 గంటల మహా ధర్నా, వంట వార్పు చేపట్టగా ఆయన హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ వ్యవస్థను ప్రైవేటీకరించడానికి బడా కార్పొరేట్లకు, బహుళ జాతి కంపెనీలకు ఫుడ్ సప్లై బాధ్యతలను అప్పజెప్పి ఫుడ్ ప్యాకెట్లను కొని పంపిణీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నదన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థను బలోపే తం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాల్సింది పోయి కొత్త కొత్త సంస్కరణలతో ఐసీడీఎస్‌ను బ్రష్టు పట్టిస్తున్నదని విమర్శించారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందించి ఆదుకోవాలి